

మా ఊరిలో మందు బంద్

కేశంపేట మండలం బోదనంపల్లిలో 14 ఏళ్ల క్రితం మొదలైన సంపూర్ణ మద్యపాన నిషేధం ఇంకా కొనసాగుతోంది. 12లో▸



అది పిల్లి కూనే!

కొత్తూరు మండలం పెంజర్లలో చిరుత కూనలు సంచరిస్తున్నాయని సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. 12లో▸



హోటళ్లలో తనిఖీలు

హోటళ్ల యజమానులు పాడైపోయిన ఆహార పదార్థాలను విక్రయిస్తే చర్యలు తప్పవని శానిటరీ ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. 12లో▸

న్యూస్‌రీల్

ఆశీర్వాదం



నూతన వధూవరులతో కేటీఆర్

శంకర్‌పల్లి: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ గురువారం శంకర్‌పల్లిలో జరిగిన తన స్నేహితుడు మాణిక్య ప్రభు కుమార్తె వివాహానికి హాజరయ్యారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున ఫంక్షన్ హాల్‌కు చేరుకుని ఆయనకు ఘన స్వాగతం పలికారు. సెల్ఫీలు దిగేందుకు ఉత్సాహం చూపారు. అనంతరం కేటీఆర్ నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఆంగ్లంపై పట్టు సాధించాలి



స్కూల్ ప్రగతిని పరిశీలిస్తున్న వెంకటేశ్

బడంగ్‌పేట్: ప్రతిఒక్కరూ ఆంగ్లంపై పట్టు సాధించాలని విద్యా కమిషన్ సభ్యుడు డాక్టర్ చారకొండ వెంకటేశ్ విద్యార్థులకు సూచించారు. గురువారం బడంగ్‌పేట్ ఉన్నత పాఠశాలను పరిశీలించిన ఆయన విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. స్కూల్‌లో నిర్వహిస్తున్న వృత్తి విద్య, ప్రథమ్, ఆర్క్ ఫౌండేషన్ల కార్యక్రమాలను తెలుసుకుని సంతోషం వ్యక్తంచేశారు. దావత్‌ఖాన్‌గూడలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్‌పీఎస్‌లో విద్యార్థులకు సీట్ల కేటాయింపు

ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా రెవెన్యూ అధికారి సంగీత సమక్షంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ నందు గిరిజన విద్యార్థులకు ఒకటో తరగతిలో ప్రవేశం కోసం లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేశారు. లంబాడ-4, ఎరుకల-1 ఇతర గిరిజన తెగలు-1 మొత్తం 6 సీట్లకు (బాలురు-3, బాలికలు-3) కేటాయించినట్లు ఆమె చెప్పారు. వచ్చిన దరఖాస్తులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేసినట్లు వివరించారు.

వర్షాలకు అప్రమత్తంగా ఉండండి

డీఎల్‌పీఓ సతీష్‌రెడ్డి



అమ్డాపూర్‌లో వాగును పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ సతీష్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎల్‌పీఓ సతీష్‌రెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామ పంచాయతీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న కార్యక్రమాలను పంచాయతీ కార్యదర్శి కవితను అడిగి తెలుసుకున్నారు. వర్షాల వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయో అడిగారు. అనంతరం గ్రామ సమీపంలో ఉన్న కుంటలు, వాగులను ఆయన సందర్శించి పరిశీలించారు. ప్రమాదాలు ఉన్న చోట ప్రజలను వెళ్లకుండా చూడాలని పేర్కొన్నారు. పర్యటనలో పంచాయతీ కార్యదర్శి కవిత, కారోబార్ గోపాల్‌చారి పాల్గొన్నారు.

బాటసింగారం సహకార చైర్మన్‌పై వేటు

పదవి నుంచి తొలగిస్తూ అధికారుల ఉత్తర్వులు



అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్‌ను పదవి నుంచి తొలగిస్తున్నట్లు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పాలకవర్గం తీర్మానాలకు విరుద్ధంగా వ్యక్తిగత నిర్ణయాలు తీసుకుంటున్నాడని, రుణాల వడ్డీ మాఫీ విషయంలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపిస్తూ పలువురు మాజీ సర్పంచ్‌లు ఈనెల 11న ఆయనపై సహకార శాఖ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ నిర్వహించిన అనంతరం ఆరోపణలు వాస్తవమేనని తేలడంతో అతనిపై వేటు వేసినట్లు అధికారులు పేర్కొన్నారు. పదవీ కాలాన్ని పొడిగించిన గురువారం రోజునే ఈ నిర్ణయం వెలువడటం చర్చనీయాంశమైంది.

అవినీతే అసలు సమస్య!

- స్వేచ్ఛ సమానత్వం అందరికీ అందాలి
- యంత్రాంగం మరింత పటిష్టంగా పనిచేయాలి
- 'సాక్షి' సర్వేలో జిల్లా ప్రజల అభిప్రాయం


సమాజంలో అవినీతే ప్రధాన సమస్యగా మారిందని మెజార్టీ ప్రజలు అభిప్రాయపడ్డారు. స్వాతంత్య్రం సిద్ధించి 79 ఏళ్లు గడుస్తున్నా స్వేచ్ఛ, సమానత్వం అన్నివర్గాలకు అందడం లేదని తెలిపారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో వివిధ వర్గాలకు చెందిన 60 మందిని 'సాక్షి' సర్వే చేయగా 24 మంది వ్యవస్థలో అవినీతి పేరుకుపోయిందని పేర్కొన్నారు. స్వేచ్ఛ, సమానత్వం వంటివి అందరికీ అందడం లేదని 23 మంది తెలిపారు. స్వాతంత్య్ర ఫలాలు అందరికీ దక్కాలంటే అధికార యంత్రాంగం మరింత పకడ్బందీగా పనిచేయాలని 22 మంది, చట్ట సభల్లో మార్పు రావాలని 16 మంది తమ అభిప్రాయాన్ని వెల్లడించారు.

– చేవెళ్ల

మీరు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య ఏది?



స్వేచ్ఛ- సమానత్వం అందరికీ చేరుతోందా..?



స్వాతంత్య్ర ఫలాలు అందరికీ దక్కాలంటే మరింత నిజాయితీగా పనిచేయాల్సిన రంగం ఏది?



పటిష్ట భారత్‌కే జై



టాక్ షోలో మాట్లాడుతున్న కేజీ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల డీన్ జరీనా

అగ్రగామి దేశంగా నిలవాలని యువత ఆకాంక్ష

- మొయినాబాద్‌లోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సాక్షి టాక్ షో
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

మొయినాబాద్/చేవెళ్ల: భారతదేశాన్ని ప్రపంచంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన అగ్రగామి దేశంగా చూడాలని యువత ఆకాంక్షిస్తోంది. ఆగస్టు 15 స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా 'వందేళ్ల భారత్ ఎలా ఉండాలి' అనే అంశంపై మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం విద్యార్థులతో సాక్షి టాక్ షో నిర్వహించింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వందేళ్ల భారత్ ఎలా ఉండాలని వారి కలలు, ఆకాంక్షలను వెలిబుచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల డీఎస్ఏ డీన్ జరీనా మాట్లాడుతూ.. అభివృద్ధి చెందిన దేశాల సరసన భారతదేశం కూడా చేరేందుకు ప్రతి ఒక్కరి కృషి అవసరమన్నారు. యువత చేతిలోనే దేశ భవిష్యత్ ఉందన్నారు. వందేళ్ల భారత్ ఎలా ఉండాలని అంశంపై సాక్షి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం యువతకు స్ఫూర్తిదాయంగా నిలుస్తుందన్నారు. దేశం కోసం యువత ఏం చేస్తామని, ఎలా ఉండాలని కోరుకునే ఈ కార్యక్రమం బాగుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు స్ఫూర్తి నింపే విధంగా ఉంటాయని కితాబిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

యువతదే బాధ్యత



ఎంతో మంది సమరయోధుల త్యాగాలతో వచ్చిన దేశ స్వాతంత్య్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి యువతపై ఉంది. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారు అని ఎదిరి చూడకుండా ప్రతిఒక్కరూ తమదే బాధ్యత అనే విధంగా దేశం కోసం పనిచేయాలి. 79 ఏళ్ల స్వాతంత్య్రంలో సాధించుకున్న విజయాలను గుర్తుచేసుకుంటూ వందేళ్ల భారత్ కోసం చేయాల్సిన బాధ్యతలను, లక్ష్యాలను గుర్తు చేసుకోవాలి.

– చంద్రప్రకాశ్, ఈసీ డిపార్ట్‌మెంట్ అసోసియేట్

ఉచిత వైద్యం ఇవ్వాలి



దేశానికి స్వాతంత్య్రం వచ్చి 79 ఏళ్లు అయ్యింది. కానీ అందరికీ విద్య, వైద్యం సరిగా అందని పరిస్థితి ఉంది. చదువును, ఆరోగ్యాన్ని కొనుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి వందేళ్ల భారత్‌లో మారాలి. విద్య, వైద్యం అందరికీ ఉచితంగా అందాలి. – ప్రణీత్

మహిళలకు స్వేచ్ఛ రావాలి



సాంకేతిక రంగంలో దేశం మరింత అభివృద్ధి చెందాలి. మహిళలకు పూర్తి స్వేచ్ఛ రావాలి. ప్రతిఒక్కరూ చైతన్యవంతులు కావాలి. మహిళలంతా చదువుకుంటేనే వారికి పూర్తి స్వేచ్ఛా స్వతంత్రాలు లభిస్తాయి. ఇంకా మార్పుకోసం ఎదురుచూడటం కాదు. వందేళ్ల భారత్‌లో మారి చూపించాలి.

– గ్రీష్మ

అన్ని రంగాల్లో అభివృద్ధి



2047 నాటికి భారత దేశం అభివృద్ధి చెందిన దేశంగా అన్ని రంగాల్లో రాణించాలి. విద్య, వైద్యం, టెక్నాలజీ, పరిపాలన విభాగాలన్ని బలోపేతం కావాలి. యువత అన్ని రంగాల్లో ముందుకు రావాలి. అవసరమైన టెక్నాలజీని ఉపయోగించుకుని దేశాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించాలి. – అమూల్య

అందరికీ ఉచిత విద్య



దేశంలో ధనిక, పేద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికి ఉచిత విద్య అందుబాటులోకి రావాలి. అప్పుడే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది. ప్రతిఒక్కరూ విద్యను అభ్యసించి నచ్చిన రంగాల్లో రాణించేందుకు అవకాశం ఉంటుంది. ఈ దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలి.

– సిద్దు

జాతీయభావం పెరగాలి



భిన్న మతాలు, భిన్న సంస్కృతులకు నిలయంగా ఉన్న భారతదేశంలోని ప్రజలందరిలో జాతీయభావం పెరగాలి. సంస్కృతి, సాంప్రదాయాలను ముందు తరాలకు అందించాలి. దేశం విలువలను ప్రపంచానికి చాటే విధంగా యువత ఎదగాలి.

– సమీనా

రిజర్వేషన్లు రద్దు చేయాలి



మన దేశంలో ఉన్న మతాలు, కులాల ప్రతిపాదికన ఉన్న రిజర్వేషన్ల వ్యవస్థ పూర్తిగా పోవాలి. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందరూ సమానమే అనే భావనతో జీవించేలా చట్టాలు రావాలి. రిజర్వేషన్ల వ్యవస్థతో పేదవారికి న్యాయం కంటే అన్యాయం ఎక్కువగా జరుగుతుంది.

– జశ్వంత్

సమానత్వం రావాలి



ప్రస్తుతం విద్యా వ్యవస్థలో రిజర్వేషన్ల పద్ధతి కాకుండా ప్రతిభ ఆధారంగా అందరికీ సమాన అవకాశాలు లభించాలి. అప్పుడే సమన్యాయం జరుగుతుంది. దేశంలో ఈ విధానం అమలులోకి వస్తే దేశం మరింతగా అభివృద్ధి చెందుతుంది. ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.

– నాగ విఘ్నేశ్వర్

రాజ్యాంగ మార్పు అవసరం



మన రాజ్యాంగంలో అనేక మార్పులు రావాల్సిన అవసరం ఉంది. ఆనాటి అవసరాలు, పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం అందరికీ ఆదర్శంగా నిలిచింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగంలో మార్పులుండాలి.

– శివరామకృష్ణ

రాజ్యాంగం అమలు చేయాలి



మన దేశ రాజ్యాంగం ప్రపంచ దేశాలకే ఆదర్శంగా నిలుస్తుంది. ఎంతో ముందు చూపుతో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అందించారు. దానిని మన పాలకులు సక్రమంగా అమలు చేయడంలో విఫలమవుతున్నారు. రాజ్యాంగాన్ని సక్రమంగా అమలు చేయాలి.

– రాజేశ్

మార్పు కోరుకోవాలి



స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు దేశంలో అనేక మార్పులు వచ్చాయి. మనిషి ఎప్పుడు మార్పును కోరుకోవాలి. అది సమాజ హితం వైపు ఉండాలి. ప్రతి మనిషిలో మానవత్వం, మహిళల పట్ల అందరిలో గౌరవం పెరగాలి. దేశాభివృద్ధిలో మహిళలు భాగస్వాములు కావాలి.

– స్వర్ణ

సాంకేతికతలో మరింతగా..



విదేశాలల్లో ఉన్న సాంకేతిక పరిజ్ఞానానికి మించిన పురోగతిని మన దేశంలో మరింతగా అభివృద్ధి చెందాలి. ప్రపంచ దేశాలతో పోటీ పడాలే ఉండాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా అభివృద్ధి చెందుతున్న ఏఐ టెక్నాలజీ లాంటి కోర్సులు మరిన్ని రావాలి. – సాయి

చట్టాల్లో మార్పు రావాలి



దేశంలో ఉన్న చట్టాల్లో అనేక మార్పులు చేయాలి. దేశంలో నివసించే ప్రతి ఒక్కరికి భద్రతపై భరోసా కల్పించాలి. ప్రతి ఒక్కరి ఆలోచనల్లో మార్పు రావాలి. ప్రతి ఒక్కరు దేశం పట్ల బాధ్యతాయుతంగా ఉండాలి. – సింధు

రాజకీయాల్లోకి రావాలి



దేశ రాజకీయాల్లో యువత భాగస్వామ్యం పెరగాలి. ప్రజాస్వామ్య దేశంలో నాయకులు ప్రజల కోసం పనిచేసేలా ఉండాలి. ప్రస్తుత రాజకీయాలు స్వార్థం, అవినీతి మయంగా మారాయి. వీటిని రూపుమాపేందుకు చైతన్యవంతమైన యువత ముందుకు రావాలి. – మౌనిక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రజలను అప్రమత్తం చేయండి

కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. గురువారం వర్షాల కారణంగా రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి సమావేశమయ్యారు. ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను అన్ని శాఖల అధికారులు తు.చా తప్పకుండా పాటించాలన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రతి శాఖ అధికారులు వారి పరిధిలో విధులను బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. ఎలాంటి నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవన్నారు. కాజ్‌వేల మీద ఎవరూ ప్రయాణం చేయకుండా చూడాలన్నారు. చెరువులు తెగే పరిస్థితి ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్థాయి అధికారులు హెడ్‌క్వార్టర్ మెయింటెన్ చేయాలని, వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కరెంట్ స్తంభాల వద్ద జాగ్రత్తలు అవసరమన్నారు. ప్రధాన రహదారిపై నీరు ఆగిపోతే వెంటనే స్పందించాలన్నారు. శిథిలావస్థ భవనాల్లో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు. అకారణంగా ప్రజలు బయటకు రాకుండా చూసుకోవాలన్నారు. డప్పు చాటింపు వేసి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 24 గంటలు పని చేస్తుందన్నారు. జిల్లా ప్రజలంతా అప్రమత్తంగా ఉండి, సమస్యలను తక్షణమే తెలియజేయాలని సూచించారు.

ఔటర్‌పైకి దొర్లిపడిన బండరాళ్లు

వాహనాలు రాకపోవడంతో తప్పిన ప్రమాదం



ఔటర్ సర్వీసు రోడ్డుపై పడిన బండరాళ్లు

మణికొండ: నార్సింగి నుంచి పోలీస్ అకాడమీ ఔటర్ సర్వీసు రోడ్డులో పెను ప్రమాదం తప్పింది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో భారీ బండరాయితో పాటు మరో చిన్నరాయి గురువారం సాయంత్రం సర్వీసు రోడ్డుపైకి దొర్లుకుంటూ వచ్చాయి. సర్వీసు రోడ్డు ఓ వైపు నుంచి పడి మధ్యలో డివైడర్‌పై నుంచి దాటి అవతలి రోడ్డు వరకు వెళ్లాయి. ఆ సమయంలో రెండు వైపుల నుంచి ఎలాంటి వాహనాలు రాకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. మంచిరేవుల 60 గజాల ఇందిరమ్మ కాలనీ పక్కనే ఔటర్ సర్వీసు రోడ్డు నిర్మాణ సమయంలో కొంత మేర గుట్టను తొలగించారు. పక్కనున్న గుట్టలను అలాగే వదిలివేయటంతో అవి వర్షాకాలం సమయంలో కూలుతున్నాయని స్థానికులు తెలిపారు. గురువారం రెండు రాళ్లు కూలగా మరో మూడు ప్రమాదకరంగానే రోడ్డును ఆనుకునే ఉన్నాయన్నారు. రోడ్డుపైకి వచ్చిన రాళ్లను ఔటర్ రింగ్ రోడ్డు నిర్వాహకులు వెంటనే తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మరోసారి ప్రమాదం జరగకముందే వాటిని తొలగించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం



ఆమనగల్లులో మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి

- ఓట్ల చోరీపై ఉద్యమానికి ప్రజలు సహకరించాలి
- నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి
- ఆమనగల్లులో బీసీ హాస్టల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ఆమనగల్లు: దేశంలో జరుగుతున్న ఓట్ల చోరీ ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదకరంగా పరిణమించిందని నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి అన్నారు. దీనికి వ్యతిరేకంగా కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటానికి ప్రజలంతా అండగా ఉండాలని ఆయన కోరారు. ఆమనగల్లులో గురువారం అరబిందో ఫార్మా ఫౌండేషన్ సీఎస్ఆర్ రెస్పాన్సిబులిటీ నిధులు రూ.4 కోట్లతో చేపట్టిన బీసీ బాలుర వసతిగృహ భవన నిర్మాణానికి ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, మార్కెట్ చైర్మన్ యాట గీత, అరబిందో ఫార్మా ఫౌండేషన్ డైరెక్టర్ నిత్యానందరెడ్డితో కలిసి శంఖుస్థాపన చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. దేశంలో రాజకీయ ఆధిపత్యం కోసం బీజేపీ ఓట్ల చోరీకి పాల్పడుతోందని ఆరోపించారు. దొంగ ఓట్లతో అధికారంలోకి రావడానికి కుట్రలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటు చోర్ గద్దె దిగాలని కోరుతూ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపట్టనున్నట్లు చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గంలో బిస్కెట్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామన్నారు. ఆమనగల్లులో సబ్ రిజిస్ట్రార్, ఏసీపీ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని స్పష్టంచేశారు. జూనియర్ కాలేజీ స్థల వివాదాన్ని, కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామని వెల్లడించారు. బీసీ రిజర్వేషన్ బిల్లు తీసుకు బీజేపీ అడ్డుపడుతోందని ఆరోపించారు.

అభివృద్ధే లక్ష్యం..

కల్వకుర్తి అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తమ ఉనికిని కాపాడుకోవడానికే కొన్ని రాజకీయ పార్టీల నాయకులు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో కల్వకుర్తిని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు కేశవులు, యాట నర్సింహ, జగన్, మానయ్య, బీసీ సంక్షేమశాఖ డీడీ కేశురామ్, మున్సిపల్ కమిషనర్ శంకర్, తహసీల్దార్ లలిత తదితరులు పాల్గొన్నారు.

అది పిల్లి కూనే!


చిరుత ఆకారంలో ఉన్న పిల్లికూన కళేబరం

కొత్తూరు: మండలంలోని పెంజర్ల గ్రామంలో ఓ ఎంఎస్‌సీ పరిశ్రమకు చెందిన స్థలంలో చిరుత కూనలు సంచరిస్తున్నాయని స్థానికంగా సామాజిక మాధ్యమాల్లో గురువారం వైరల్ అయింది. గ్రామంలో కొనసాగుతున్న ఓ మల్టీ నేషనల్ పరిశ్రమకు చెందిన ఖాళీ స్థలంలో కార్మికులకు ఇటీవల చిరుతపులి పిల్ల ఆకారంలో ఉన్న ఓ కళేబరం కనిపించింది. ఈ విషయం వైరల్‌గా మారడంతో విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు మృతి చెందిన కూన కళేబరాన్ని పరిశీలించారు. మృతి చెందిన కూన అటవీ ఏషియన్ లియోపర్డ్ జాతికి చెందిన పిల్లికూనగా గుర్తించారు. దీంతో కార్మికులతో పాటు స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

అక్రమాలకు పాల్పడుతున్న ఖురేషీభాయ్‌కి రిమాండ్

శంకర్‌పల్లి: పట్టణ శివారులోని డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద ఖురేషీబాయ్ అనే వ్యక్తి మెయింటెనెన్స్ పేరిట అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నాడని ఇటీవల పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు అతనిపై శంకర్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే ఇదే వ్యక్తిపై 2023లో నగరంలోని భవానీనగర్ పీఎస్‌లో ఫోర్జరీ, ఫేక్ డాక్యుమెంట్లు తయారు చేశాడనే ఆరోపణలపై కేసు నమోదైంది. ఈకేసులో గురువారం అతన్ని అరెస్టు చేసిన భవానీనగర్ పోలీసులు రిమాండ్ నిమిత్తం చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ విషయంపై శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్ గౌడ్‌ని వివరణ సంప్రదించగా.. ఖురేషి పై 2018లో కారు యాక్సిడెంట్ కేసు, 2025లో బెదిరింపు కేసు, ఇదే ఏడాదిలో అక్రమంగా మెయింటెనెన్స్ వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

మీర్‌పేట: పార్కు చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శంకర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లెలగూడలో నివాసముండే ముత్తయ్య తన ద్విచక్ర వాహనాన్ని బాలాపూర్ చౌరస్తాలో బుధవారం పార్కు చేసి పని నిమిత్తం సొంత గ్రామానికి వెళ్లాడు. తిరిగి సాయంత్రం వచ్చేసరికి వాహనం కనిపించలేదు. అక్కడే ఉన్న సీసీ కెమెరాను పరిశీలించగా ఓ దొంగ వాహనాన్ని చోరీ చేసినట్లు తెలుసుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్, దుకాణాల్లో తనిఖీలు


హోటల్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు

తుర్కయంజాల్: హోటళ్లు, బేకరీలు, దుకాణాల యజమానులు పాడైపోయిన ఆహార పదార్థాలను విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వనిత హెచ్చరించారు. గురువారం ఆమె కమిషనర్ కె.అమరేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు రాగన్నగూడలోని డెక్కన్ బావర్చి హోటల్‌ను తనిఖీ చేయగా పలు ఆహార పదార్థాలు పాడైపోయినట్లు, నిల్వ ఉంచినట్లు గుర్తించారు. కిచెన్ పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో రూ.10 వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఓ కిరాణ దుకాణంలో గడువు ముగిసిన బ్రెడ్ ప్యాకెట్ విక్రయిస్తుండగా అతడికి రూ.1,000 జరిమానా విధించారని వివరించారు.

పెయింటర్ అదృశ్యం

మొయినాబాద్: పనికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన పెయింటర్ అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సురేష్ బచ్చా ప్రసాద్(50) కుటుంబ సభ్యులతో కలిసి రెండేళ్ల క్రితం హిమాయత్‌నగర్‌కు వలసవచ్చాడు. ఇక్కడే పెయింటింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 12న ఉదయం 6 గంటలకు పనికి వెళ్తున్నానని ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య మంజు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో గురువారం మొయినాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వీధికుక్కలను పట్టుకెళ్లిన జంతు సంరక్షకులు


వీధి కుక్కలను పడుతున్న జంతు సంరక్షకులు

షాబాద్: వీధి కుక్కలను పట్టి బహిరంగ ప్రదేశంలో వదిలిపెట్టినట్లు సర్దార్‌నగర్ మాజీ సర్పంచ్ మునగపాటి నర్సింలు అన్నారు. గురువారం మండల పరిధిలోని సర్దార్‌నగర్‌లో జంతు సంరక్షకులు వీధి కుక్కలను పట్టుకెళ్లారు. వాటికి తీసుకెళ్లేందుకు అయ్యే ఖర్చును జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి రూ.20వేల నగదును అందజేసినట్లు ఆయన తెలిపారు. గత నాలుగు రోజుల క్రితం సర్దార్‌నగర్ గ్రామంలో ఎనిమిది మందిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచిన సంఘటన పాఠకులకు విధితమే. రోజు రోజుకు వీధి కుక్కలు మనుషులపై దాడి చేయడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని వాటిని పట్టించినట్లు తెలిపారు. ప్రజలకు వీధి కుక్కల భయం లేకుండా చేశామని ఆయన స్పష్టం చేశారు.

ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి

- గట్టు దాటుతుండగా ప్రమాదం
- కరిగెట పొలంలోనే దుర్మరణం


కృష్ణయ్య(ఫైల్)

కడ్తాల్: కరిగెట దున్నుతుండగా ట్రాక్టర్ పైనుంచి కింద పడి డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన గురువారం మండల పరిధిలోని మక్తమాధారంలో చోటు చేసుకుంది. సీఐ గంగాధర్ తెలిపిన వివరాలి ఉన్నాయి.. గ్రామానికి చెందిన ఆమంచ కృష్ణయ్య(54) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మధ్యాహ్నం ఓ రైతుకు గరిగెట పొలం దున్నేందుకు వెళ్లాడు. ఒక మడి నుంచి మరో మడిలోకి వెళ్లేందుకు గట్టు దాటుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడ్డాడు. కేజీవీల్ అతని తల పైనుంచి వెళ్లడంతో బురద పొలంలోనే చనిపోయాడు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబులకు కోర్టు వినూత్న శిక్ష

బంజారాహిల్స్: మద్యంతాగి రెండు అంతకంటే ఎక్కువసార్లు పట్టుబడ్డ పలువురికి న్యాయస్థానం వినూత్న శిక్ష విధించింది. ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 42 మంది పట్టుబడ్డారు. వీరందరినీ పోలీసులు గురువారం నాంపల్లిలోని 12వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారు. ఇందులో ముగ్గురు వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.2100 జరిమానాతో పాటు కోర్టు ఆవరణలో మొక్కలు నాటాలని ఆదేశించారు. అలాగే ఒక వాహనదారుడికి రూ.3300 జరిమానాతో పాటు మూడు రోజుల జైలు శిక్ష, మరో వాహనదారుడికి రూ.3300 జరిమానాతో పాటు రెండు రోజుల జైలు శిక్ష, ముగ్గురు వాహనదారులకు రూ.2100 జరిమానాతో పాటు రెండు రోజుల జైలు శిక్ష విధించారు. అలాగే ఆరుగురు వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.3300 జరిమానాతో పాటు కూడళ్లలో సోషల్ సర్వీస్ చేయాల్సిందిగా ఆదేశించారు. దీంతో ఆరు మంది వాహనదారులు మైత్రీవనం చౌరస్తాలో డోంట్ డ్రంక్ అండ్ డ్రైవ్ అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ కమ్యూనిటీ సర్వీస్ చేశారు. మందుబాబుల నుంచి మొత్తం రూ.1,12,200 జరిమానాలు వసూలు చేసినట్లు వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ వెల్లడించారు.

మద్యం మత్తులో డ్రైవింగ్

రాజేంద్రనగర్: డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులో పట్టుబడిన 13 మందిని రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు ఉప్పర్‌పల్లి కోర్టు న్యాయమూర్తి ముందు గురువారం ఉదయం హాజరుపరిచారు. 13 మందిలో ఆరుగురికి రెండు రోజుల పాటు జైలు శిక్ష, జరిమానా విధించగా... ఏడుగురికి ఒక రోజు సామాజిక సే వా కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. దీంతో ఏడుగురిని రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ, ఇన్‌స్పెక్టర్ రాజు ఆరాంఘర్ చౌ రస్తా వద్ద విధులు నిర్వహించేలా ఆదేశించారు. ప్ల కార్డులను పట్టుకొని వా హనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ బాలాజీ మాట్లాడుతూ... మద్యం తాగి వాహనాలను నడపవద్దన్నారు. వాహనాలను నపడంతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు.

అగ్ర భారతే లక్ష్యం

- ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు
- సాక్షి ఆధ్వర్యంలో వందేళ్ల భారత్‌పై టాక్ షో

విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు పెద్దపీట వేయాలి

ఇబ్రహీంపట్నం: ఒకే విధానంతో కూడిన వ్యవస్థ ఉన్నప్పుడే దేశం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని, యువతలో కమ్యూనికేషన్ స్కిల్ డెవలప్‌మెంట్‌ను పెంపొందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యార్థులు పేర్కొన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సాక్షి దినపత్రిక ఆధ్వర్యంలో 'వందేళ్ల భారత్ ఎలా ఉండాలి' అనే అంశంపై ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన సాక్షి టాక్ షోలో పలువురు విద్యార్థులు, అధ్యాపకులు తమ అభిప్రాయాలను స్పష్టంగా వ్యక్త పరిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొ.రాధిక మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకత వెలికితీసే విద్యాబోధనకు సంబంధించిన కోర్సులు రావాలన్నారు. స్వయం శక్తితో ఉపాధి పొందేలా తీర్చిదిద్దాలన్నారు. ఆర్థిక కార్యకలాపాల్లో మహిళలను భాగస్వామ్యం చేయాలన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులు ఆకర్షించి ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు సైతం తమ అభిప్రాయాలను పంచుకున్నారు.


సాక్షి టాక్ షోలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాధిక


సాక్షి టాక్ షోలో పాల్గొన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

విద్యతోనే దేశాభివృద్ధి



విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుంది. ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్యను అందించాలి. అందుకు తగ్గట్టుగా మౌలిక సదుపాయాలను కల్పించాలి. విద్యాబోధనలో సమూల మార్పులు రావాలి.

– జాస్మిన్, బీఏ, ఫస్టియర్

ఒకే వ్యవస్థ ఉండాలి



దేశంలో ఒకే విధానంతో కూడిన వ్యవస్థ ఉండాలి. ప్రైవేటీకరణ పేరుతో దేశ వ్యవస్థను నాశనం చేయవద్దు. ఒకే గొడుగు కింద అన్ని వ్యవస్థలుంటే. దేశాభివృద్ధికి సరైన నిర్ణయాలు తీసుకునే అవకాశముంటుంది. దేశంలో వనరులకు కొదవలేదు. వాటిని కాపాడుకుంటూ దేశ ప్రగతికి తోడ్పడాలి.

– మనీషా, బీఎస్సీ, సెకండియర్

ప్రగతిబాటలో పల్లెలుండాలి



పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు. అలాంటి ప్రాంతాలను అభివృద్ధి చేయాలి. స్వాతంత్య్రం సిద్ధించి 79 ఏళ్లు కావొస్తున్న గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థులకు సరైన విద్య, ఉపాధి అవకాశాలు దక్కడం లేదు. ఈ వ్యవస్థను పూర్తిగా మార్చాలి.

– విజయ్, బీఏ, ఫస్టియర్

యువతను కాపాడుకోవాలి



మన దేశంలో నైపుణ్యం గల యువత ఎంతో మంది ఉన్నారు. వారు విదేశాల్లో ఉపాధి పొందుతున్నారు. అలాంటి వారి శక్తి సామర్థ్యాలను దేశం ఉపయోగించుకోవాలి. ప్రతిభ గల వారికి ప్రాధాన్యతను ఇస్తూ దేశాభివృద్ధిలో భాగం చేయాలి

– ప్రసన్నలక్ష్మి, బీఎస్సీ, సెకండియర్

స్వయం ఉపాధి కల్పించాలి



స్వయం ఉపాధి పొందేలా యువతను తీర్చిదిద్దాలి. ఇతరులపై ఆధార పడకుండా వారే స్వశక్తితో ఉన్నంతగా ఎదిగేందుకు విద్యాబోధన దోహదపడాలి. ఆ దిశగా విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలి. స్టార్టప్ కంపెనీలు నెలకొల్పాలి.

– ఫాతిమా, బీకాం, ఫస్టియర్

ఆరోగ్య భారత్‌గా తీర్చిదిద్దాలి



ఆరోగ్యమే మహాభాగ్యం. ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉంటే సమాజం బాగుంటుంది. అందుకు పల్లె నుంచి పట్టణం వరకు వైద్యసేవలను అందించాలి. మనిషి ఆరోగ్యంగా ఉంటేనే మంచి ఆలోచనలు వస్తాయి. తద్వారా దేశ ఆర్థికాభివృద్ధిలో కీలకంగా మారుతారు.

– కేశవర్ధన్, బీఎస్సీ, సెకండియర్

మహిళలకు సీట్లు ఇవ్వాలి



చట్ట సభల్లో సమాన ప్రాతినిధ్యం కల్పించాలి. ఇంటికి దీపం ఇల్లాలు ఎలా అంటామో జనాభా నిష్పత్తి ప్రకారం చట్టసభల్లో మహిళలకు సీట్లు కేటాయించాలి. అప్పుడే మహిళా సాధికారత సాధించి దేశ పురోగమనం సాధ్యమౌతుంది.

– స్వాతి, బీఎస్సీ, ఫస్టియర్

టెక్నాలజీలో మార్పులు రావాలి



శాస్త్ర సాంకేతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు రావాలి. ఫ్రెంచ్ విప్లవం నుంచి తెలంగాణ ఉద్యమం వరకు విద్యార్థులే కీలకపాత్ర పోషించారు. వందేళ్ల స్వాతంత్య్ర భారత్ అభివృద్ధి దేశంగా ప్రపంచలో పేరుప్రఖ్యాతలు పొందాలంటే యువత చేతల్లోనే ఉంది. ఆ దిశగా వాళ్లకి తర్ఫీదు ఇవ్వాలి.

– డా.సురేశ్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకుడు

దేశాభివృద్ధికి కృషి చేయాలి



విద్యార్థులు, యువత దేశాభివృద్ధికి పోటీ పడాలి. కుల, మత, ప్రాంత విభేదాలు మూఢ నమ్మకాలు పక్కన పెట్టాలి. ఆర్టికల్ 14 ప్రకారం మహిళలకు సమాన హక్కులుండాలి. దేశంలో విజ్ఞానవంతులు కొదవలేదు. వారు విదేశాలకు వెళ్లకుండా సరైన అవకాశాలు సృష్టించాలి

– డా.రమేశ్, అధ్యాపకుడు

మా ఊరిలో మందు బంద్

- పలు గ్రామాల్లో సంపూర్ణ మద్యపాన నిషేధం
- మహిళల చైతన్యంతో



కిషన్‌నగర్‌లో మద్యపాన నిషేధ పోరాటానికి మద్దతు తెలుపుతున్న స్థానికులు (ఫైల్)

షాద్‌నగర్: కేశంపేట మండలం బోదనంపల్లిలో 14 ఏళ్ల క్రితం మొదలైన సంపూర్ణ మద్యపాన నిషేధం ఈ రోజు వరకూ అలాగే కొనసాగుతోంది. ఈగ్రామంలో ఎక్కడా బెల్టు షాపులు, మద్యం సేవించడం కనిపించదు. మద్యం ప్రియులు కావాలనును కుంటే బయటి ప్రాంతాలకు వెళ్లాల్సిందే. ఇదే స్ఫూర్తితో అల్వాల గ్రామస్తులు కూడా సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమల్లోకి తెచ్చారు.

ఒక్కడితో మొదలై..

మద్య నిషేదం కోసం పలు గ్రామాల ప్రజలు పోరాటం చేస్తున్నారు. ముందుగా ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్‌కు చెందిన నడుల్ల శేఖర్‌తో పోరాటం మొదలైంది. తమ గ్రామంలో మద్యపానం నిషేధించాలని కోరుతూ గత సెప్టెంబర్‌లో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరాహార దీక్ష చేపట్టాడు. గ్రామ పెద్దలు, మహిళలు రాజకీయాలకు అతీతంగా మద్దతుగా నిలిచారు. స్థానికంగా మద్యం విక్రయిస్తే రూ.50 వేలు జరిమానా విధిస్తామని, మద్యం అమ్మేవారిని పట్టిస్తే రూ.10 వేల నజరానా అందజేస్తామని ప్రకటించడంతో బెల్టు దుకాణాలు మూతపడ్డాయి. ఈ పోరాటం గంట్లవెళ్లి, చౌడమ్మగుట్టతండాలో కూడా కొనసాగుతోంది.


జీవితాలు నాశనం కావొద్దని



గ్రామంలో చాలా మంది మద్యానికి బానిసలవుతున్నారు. ప్రజల జీవితాలు నాశనం కావొద్దని ఆలోచనతో పోరాటం ప్రారంభించా. స్థానికుల మద్దతుతో ఎమ్మెల్యేతో పాటు అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశాం. అందరి పోరాటంతో బెల్టు దుకాణాలు మూతపడ్డాయి.

– శేఖర్, కిషన్‌నగర్, ఫరూఖ్‌నగర్ మండలం

మహిళల పోరాటంతోనే నిషేధం



మద్యంతో చాలా మంది జీవితాలు బలైపోతున్నాయి. దీంతో గ్రామంలో బెల్టు దుకాణాలు తొలగించాలని, మహిళలు పెద్ద ఎత్తున బయటికి వచ్చారు. మద్యం సీసాలను ధ్వంసం చేశారు. ఈ దెబ్బతో గ్రామంలో 14 ఏళ్లుగా మద్యం నిషేధం అమలవుతోంది.

– ఎదిర కళమ్మ, బొదనంపల్లి, కేశంపేట

జోరువాన.. హైరానా!

మొయినాబాద్‌రూరల్: జోరు వానలు కురియడంతో ఈసీ వాగు ఉప్పొంగి పంట పొలాలపై పరవళ్లు తొక్కుతోంది. గురువారం ఉదయం మండల పరిధిలోని అమ్డాపూర్ సమీపంలో వాగు కళకళలాడుతోంది. పక్కనే ఉన్న అమ్డాపూర్ గ్రామాన్ని తాకుతూ వాగు ఉధృతంగా ప్రవహించింది. రక్తమైసమ్మ సమీపంలో ఉన్న ఓ ఫంక్షన్‌హాల్‌లో భారీగా వర్షం నీరు చేరింది. అమ్డాపూర్, బాకారం లింక్ రోడ్డు పూర్తిగా నీటిలో మునిగిపోయింది. 2–3 ఏళ్ల ఈసీ వాగు ఉప్పొంగడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు.


రక్తమైసమ్మ దేవాలయం సమీపంలోని ఫంక్షన్‌హాల్‌లోకి చేరిన వర్షం నీరు


పంట పొలాల్లో భారీగా వరద నీరు


అమ్డాపూర్ సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీ వాగు